సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం | 7 | అక్టోబర్ | 2023

పత్తిచేనులోకి బ్యాక్‌వాటర్



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌తో మండలంలోని నీలిలోజిపల్లిలోని పంట చేలల్లో నీరు చేరుతోంది. మిడ్‌మానేరులో పెద్ద మొత్తంలో నీరు నిల్వ ఉండడంతో తమ పత్తి చేను లోకి నీరు చేరిందని రైతు మంద బాలయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన పలువురి పంట చేలల్లో బ్యాక్‌వాటర్ చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

న్యూస్‌రీల్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- డీఐఈవో మోహన్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు కష్టపడి ఇష్టంగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి చింతల మోహన్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథి డీఐఈవో మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాలయాల్లోని వసతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కా ర్యక్రమాలు అలరించాయి. అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

రామానుజమ్మకు సత్కారం



సిరిసిల్లకల్చరల్: వెటరన్ అథ్లెట్ రామానుజమ్మ ప్రయాణం స్ఫూర్తిదాయకమని ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య పేర్కొన్నారు. వెటరన్ అథ్లెట్ టమటం రామనుజమ్మ ఇటీవల మలేషియాలో జరిగిన పరుగుపందెంలో రజతం సాధించింది. ఈమేరకు శుక్రవారం సన్మానించారు. జనపాల శంకరయ్య, తడుక శ్రీహరి, మామిడాల సమ్మయ్య, కనకయ్య, జేవీవీ రామరాజు, దొంత దేవదాస్, ఆంకారపు జ్ఞానోభ, కైలాసం, శ్రీహరి పాల్గొన్నారు.

దుమాలలో మెడికల్ క్యాంప్



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని దుమాల గ్రామానికి ప్రభుత్వ వైద్యబృందం శుక్రవారం వెళ్లింది. గ్రామంలో ఇంటింటికి వెళ్లి రక్త పరీక్షలు చేశారు. ప్రభుత్వ వైద్యాధికారిణి స్రవంతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేశారు. స్రవంతిరెడ్డి మాట్లాడుతూ సుమారు 74 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. పది మందికి మలేరియా, ర్యాపిడ్‌టెస్ట్ చేసినట్లు చెప్పారు. సర్పంచ్ కదిరె రజిత శ్రీనివాస్, కార్యదర్శి మహేందర్, పీహెచ్ఎస్ రజినీ, సూపర్‌వైజర్ పద్మ, ఆరోగ్య సిబ్బంది నరేందర్, రమేశ్, అనసూయ, ప్రవీణ తదితరులు ఉన్నారు.

రెండోవిడత గొర్రెల కోసం ఆందోళన



గంభీరావుపేట(సిరిసిల్ల): రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలని కోరుతూ గంభీరావుపేట మండలం కోళ్లమద్దిలో యాదవులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. రాష్ట్ర యాదవ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో సిద్దిపేట–కామారెడ్డి ప్రధాన రహదారిపై బైఠాయించారు. డీడీలు చెల్లించిన వారికి త్వరలోనే గొర్రెలు పంపిణీ చేస్తామని జిల్లా పశువైద్యాధికారి కొమురయ్య, మండల పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలియజేయడంతో వారు ఆందోళన విరమించారు.

కాంగ్రెస్‌లో కొత్త జోష్!



- మేనిఫెస్టో కమిటీ భేటీతో ఉత్సాహం
- పసుపు–కుంకుమ, ఆరు గ్యారంటీలపై విస్తృత ప్రచారం
- ప్రకటనకు ముందే ఆశావహుల ప్రచారం మొదలు
- హుజూరాబాద్ బరిలో వొడితెల ప్రణవ్!



మేనిఫెస్టోలో పొందుపర్చాల్సిన అంశాలపై ప్రతిపాదనలు స్వీకరిస్తున్న మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్ నింపేందుకు అధిష్టానం నడుం బిగించింది. తాజాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులతో కలిసి మేనిఫెస్టో కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమావేశమైన వేళ.. పసుపు–కుంకుమ పథకం ప్రకటనతో పార్టీ హామీలు ప్రజల్లోకి మరింత లోతుగా చొచ్చుకెళ్తాయని కాంగ్రెస్ ధీమాగా ఉంది. గతంలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు తోడు తాజాగా ప్రకటించిన పసుపు–కుంకుమ పథకం ప్రతిపాదన కరీంనగర్‌లోనే పురుడు పోసుకోవడం, దానికి మేనిఫెస్టో కమిటీ సూత్రప్రాయ ఆమోదం తెలపడం నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపింది. శుక్రవారం ఉదయం భేటీ అయిన మేనిఫెస్టో కమిటీ పలువురు నుంచి ప్రతిపాదనలు తీసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితోపాటు కొందరు నాయకులు పసుపు–కుంకుమ పథకాన్ని ప్రతిపాదించారు. ఇప్పుడున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లను కొనసాగిస్తూనే.. వధువుకు తులం బంగారంతో తాళిబొట్టు, వెండి మెట్టెలు కూడా అందజేయాలన్న ప్రతిపాదనను కమిటీ స్వాగతించింది. దీన్ని గాంధీభవన్‌లోని పార్టీ పెద్దలు, అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి ఆమోదించుకునే పనిలో ఉన్నారు. వీటితోపాటు ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీలు మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.2,500 సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా ద్వారా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు రూ.1,200, కౌలు రైతులకు ఏటా రూ.12 వేల సాయంలను జనాల్లోకి విస్తతంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లో ముమ్మరంగా ప్రచారం చేయాలని తీర్మానించారు.

ప్రణవ్ రాక సంచలనం



వొడితెల ప్రణవ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం కరీంనగర్ ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సంచలనం రేపింది. గులాబీ పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ఎంపీ రాజేశ్వరరావు కుటుంబ వారసత్వం, ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌బాబు, కెప్టెన్ లక్ష్మీకాంతరావు, జీవీ రామకృష్ణారావులకు రక్త సంబంధీకుడు కావడంతో అన్ని పార్టీల్లోనూ ఆయన చేరిక చర్చనీయాంశంగా మారింది. సామాజికంగా, ఆర్థికంగా ప్రణవ్ రాక కాంగ్రెస్ పార్టీకి మేలు చేస్తుందని కేడర్ ధీమా వ్యక్తం చేస్తోంది.

మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ఇల్లంతకుంటలో 50 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

- ఎమ్మెల్యే రసమయిని భారీ మెజారిటీతో గెలిపించండి
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- ఇల్లంతకుంటలో 50 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించి, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగం సభలో మాట్లాడారు. మండలకేంద్రంలో రూ.17 కోట్లతో 50 పడకల ఆస్పత్రి నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. పదేళ్ల కిందటి ఇల్లంతకుంట మండలానికి ఇప్పుడు జరిగిన అభివృద్ధిని గుర్తించి ఓట్లు వేయాలని కోరారు. రానున్న రోజుల్లో ఇల్లంతకుంటకు మరిన్ని నిధులిచ్చి మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ చేసి, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, మహిళా సమాఖ్య కార్యాలయాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సుడా చైర్మన్ రామకృష్ణారావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి



పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

కోనరావుపేట(వేములవాడ): కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజీ–9లో భాగంగా నిర్మిస్తున్న మల్కపేట రిజర్వాయర్ ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. త్వరలో సీఎం కేసీఆర్ ప్రారంభించనున్న నేపథ్యంలో రిజర్వాయర్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్ శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మల్కపేట రిజర్వాయర్‌తో 60 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు, 26,150 ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరణ కానుందన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్‌డీసీ గంగయ్య, డీఈలు ఉన్నారు.

8న జిల్లా స్థాయి యోగా పోటీలు

సిరిసిల్లఅర్బన్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని విజ్ఞానవర్ధిని స్కూల్‌లో ఈనెల 8న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు సిరిసిల్ల యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఆధార్‌కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9989272428 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



స్టాండింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

- ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరవేయాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి
- విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జిల్లా స్థాయి సంఘాల సమావేశాలు

సిరిసిల్లటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తమై ప్రజల్లో చైతన్యం కలిగించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. విద్య, వైద్యం, ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, నిర్మాణ పనుల స్టాండింగ్ కమిటీలకు శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయీ సంఘం సమావేశాల్లో మాట్లాడారు. రైతు రుణమాఫీ, గొర్రెల యూనిట్ల పంపిణీ, రైతుల సమస్యలపై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్యం నిర్వహణ, రోడ్లు, వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందాలన్నారు. జిల్లాలో మహిళా సంక్షేమం, వారిపై వేధింపులు, గృహహింస, వరకట్నం, లైంగిక దాడులు, పోక్సో తదితర సేవలపై మహిళలకు సఖి సెంటర్ ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. సీఎం అల్పాహారం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

ప్రగతి నివేదికలపై పరిశీలన

విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక, నిర్మాణ పనులు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై అధికారులు ఇచ్చిన ప్రగతి నివేదికలు పరిశీలిస్తూ అధికారులను ప్రశ్నించారు. గొర్రెల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. రుణమాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెడ్పీ సీఈవో, అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాల్లో యువతకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఓపీ పెన్షన్ దారుల భర్త చనిపోతే..భార్యకు, భార్య చనిపోతే భర్తకు వెంటనే అందిస్తున్నట్లు వివరించారు.

అర్ధగంట ఆలస్యంగా..

జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ అధ్యక్షతన నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. 11 గంటలకు ప్రారంభమైంది. జెడ్పీ చైర్‌పర్సన్, సీఈవోలు ఆలస్యంగా హాజరుకాగా.. జెడ్పీటీసీలు గట్ల మీనయ్య, కొమిరిశెట్టి విజయ మాత్రమే హాజరయ్యారు. మిగతా జెడ్పీటీసీలు వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారని చైర్‌పర్సన్ అరుణ వివరించారు.

మెగా జాబ్‌మేళాలో 68 మందికి ఉద్యోగాలు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట డిగ్రీ, పీజీ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన జాబ్‌మేళాకు 110 మంది హాజరుకాగా వివిధ కంపెనీల్లో 68 మందికి ఉద్యోగాలు లభించాయి. కాలేజీ ప్రిన్సిపాల్ వి.విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ శ్రీవల్లి, టాస్క్ అండ్ కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్, ఫౌండేషన్ ప్రతినిధి తిరుపతి పాల్గొన్నారు.

17 ఏళ్లకు ఇంటికి చేరిన గల్ఫ్‌బందీ

- 2005లో జైలుపాలైన కోనరావుపేట యువకుడు
- చిన్నాభిన్నమైన కుటుంబం
- ఇన్నాళ్లకు ఇంటికి చేరిన వైనం



కుటుంబ సభ్యులతో లక్ష్మణ్

కోనరావుపేట(వేములవాడ): పుట్టిన ఊరిలో ఉపాధి లేక గల్ఫ్‌బాట పట్టిన యువకుడు అక్కడ జరిగిన ఓ సంఘటనతో జైలుపాలై.. పదిహేడేళ్లకు స్వగ్రామానికి తిరిగొచ్చాడు. యుక్త వయసులో వెళ్లిన వ్యక్తి మానసికస్థితి సరిగ్గా లేని పరిస్థితిలో స్వగ్రామంలో అడుగుపెట్టాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన దండుగుల లక్ష్మణ్ 17 ఏళ్లకు శుక్రవారం ఇంటికి చేరాడు.

దుబాయిలో ఘటన... ఇక్కడ విషాదం

కోనరావుపేటకు చెందిన దండుగుల లస్మవ్వ–నర్సయ్య దంపతుల కుమారుడు లక్ష్మణ్ 2005లో దుబాయ్ వెళ్లాడు. అదే సంవత్సరం డిసెంబర్ 29న అక్కడి జబల్‌అలీ ప్రాంతంలోని డాల్ఫిన్ మెకానికల్ సైట్‌లో కొందరు కేబుల్ వైరు దొంగతనానికి ప్రయత్నించారు. ఆ సైట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన వీరబహదూర్ చూడడంతో దొంగతనానికి వచ్చిన దుండగులు అతన్ని హత్య చేసి పరారయ్యారు. ఈ కేసులో నిందితులుగా భావిస్తూ అక్కడి పోలీసులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఆరుగురిని అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో కోనరావుపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్‌తోపాటు సిరిసిల్ల మండలం పెద్దూరుకు చెందిన సోదరులు శివరాత్రి రవి, మల్లేశం, చందుర్తికి చెందిన బొల్లి వెంకటి ఉరఫ్ నాంపెల్లి, మల్యాల మండలం మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు, కొడిమ్యాల మండలం నమిలికొండకు చెందిన సయ్యద్ ఖరీం ఉన్నారు. వీరిలో సయ్యద్ ఖరీం 2014లో విడుదల అయ్యాడు.

24 ఏళ్ల జైలు శిక్ష

హత్య కేసులో నిందితులుగా భావించిన అక్కడి కోర్టు వీరికి 24 ఏళ్ల జైలుశిక్ష విధించింది. జైలు జీవితం గడుపుతున్న తమ వారిని రప్పించేందుకు వారి కుటుంబ సభ్యులు చాలా ప్రయత్నాలు చేశారు. మంత్రి కేటీఆర్ నేపాల్‌కు వెళ్లి సెక్యూరిటీ గార్డు కుటుంబాన్ని కలిసి రూ.15లక్షల పరిహారం అందించారు. వారితో క్షమాభిక్షపత్రాలపై సంతకాలు తీసుకుని.. దుబాయ్ కోర్టుకు పంపగా.. ఆ కోర్టు అంగీకరించలేదు. దీంతో వారు జైలు నుంచి విడుదల కాలేదు. ప్రస్తుతం లక్ష్మణ్ మానసికస్థితి సరిగ్గా లేదని విడుదల చేసినట్లు తెలిసింది.

విడాకులు ఇచ్చిన భార్య

లక్ష్మణ్ దుబాయి వెళ్తున్నప్పుడు భార్య పద్మ గర్భిణి. అతడు వెళ్లిన కొద్ది నెలలకు మగబిడ్డ జన్మించాడు. లక్ష్మణ్ దుబాయిలో జైలుపాలు కావడంతో భార్య పద్మ కొన్ని రోజులు అత్తవారింట్లోనే ఉంది. వీరి కుమారుడు ఏడాదికే మృతిచెందాడు. భర్త రాక కోసం ఎదురుచూసిన పద్మకు ఆశలు సన్నగిల్లడంతో పుట్టింటికి వెళ్లి విడాకుల కోసం నోటీసులను దుబాయి జైలులో ఉన్న లక్ష్మణ్‌కు పంపింది. లక్ష్మణ్ సంతకాలు చేయడంతో విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. లక్ష్మణ్ తండ్రి నర్సయ్య కొన్నాళ్ల క్రితం మృతిచెందాడు. తల్లి నర్సవ్వ ఇన్నాళ్లు చేసిన పోరాటఫలితంగా కుమారుడు లక్ష్మణ్ ఇంటికి చేరాడు.

సీఎం అల్పాహారం ఆదర్శనీయం

- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ
- జిల్లాలో అల్పాహారం కార్యక్రమం ప్రారంభం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఎమ్మెల్యే



రుచి ఎలా ఉందని అడుగుతున్న కలెక్టర్

సిరిసిల్లటౌన్: నాణ్యమైన విద్య, మెరుగైన వసతులతో ప్రభుత్వ బడులు దేశానికే తలమానికంగా నిలుస్తున్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సీఎం అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్వరాష్ట్రంలో బడుల దశను సీఎం కేసీఆర్ మార్చివేశారన్నారు. కార్పొరేట్‌ను తలదన్నేలా విద్యాబోధన, మౌలిక వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ విద్యార్థుల హాజరు పెంపు, పౌష్టికాహార లోపం నివారణకు ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి స్వయంగా పిల్లలకు టిఫిన్స్ వడ్డించి.. రుచి ఎలా ఉందని తెలుసుకున్నారు. టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ఆర్‌బీఎస్ చైర్మన్ గడ్డం నర్సయ్య, అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ ఎండీ ఆయాజ్, డీఈవో రమేశ్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, కౌన్సిలర్లు రెడ్యానాయక్ ఉన్నారు.

అల్పాహారం అందించడం సంతోషం

వేములవాడఅర్బన్: విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడమే సీఎం కేసీఆర్ ఉద్దేశ్యమని వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. వేములవాడ మండలం చీర్లవంచలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సీఎం అల్పాహార కార్యక్రమన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం అందించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు త్వరలో రూ.14కోట్ల నష్టపరిహారం అందనుందని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఎంపీపీ బూర వజ్రమ్మ, జెడ్పీటీసీ మ్యాకల రవి, సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, సర్పంచ్ రంగు సత్తమ్మ, ఎంపీటీసీ దేవరాజు, ఉపసర్పంచ్ శ్రీనివాస్ ఉన్నారు.

క్లుప్తంగా

బ్యాంకు సేవలపై అవగాహన కల్పించాలి

• ఎస్పీ అఖిల్ మహాజన్



చందుర్తి(వేములవాడ): ఖాతాదారులకు బ్యాంకులు అందిస్తున్న సేవలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. మండలంలోని దేవునితండాకు చెందిన గుగులోతు రవి ఇటీవల మృతిచెందగా, అతని భార్య సునీతకు రూ.లక్ష ప్రమాదబీమా చెక్కును గాయత్రి బ్యాంకు ఏజీఎం వంశీకృష్ణ, ఎస్పీ అఖిల్‌మహాజన్ చేతుల మీదగా శుక్రవారం అందించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ బ్యాంకులు అందిస్తున్న ప్రమాదబీమా సౌకర్యాలను వివరించాలన్నారు. వేములవాడ గాయత్రి బ్యాంకు మేనేజర్ గజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి



సిరిసిల్లఅర్బన్: హైదరాబాద్‌లో ఈనెల 8న నిర్వహించే ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాణవేణి లక్ష్మణ్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభకు జిల్లాలోని ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ముదిరాజ్ రాష్ట్ర నాయకులు పిట్టల భూమేశ్, పట్టణాధ్యక్షుడు కీసరి నాగరాజు, రేగుల రాజ్‌కుమార్, రంగు అంజయ్య, పుష్ప మోహన్, శ్రీనివాస్, నర్సయ్య, శేఖర్, నారాయణ, చుక్క శేఖర్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వ వైఖరితో పత్రికా స్వేచ్ఛను హరిస్తుందని ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో మీడియా కార్యాలయంలో పోలీసులు దాడులను నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ చేపడుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, సాయి, ఆదిత్య, అభిషేక్, నవీన్, అరుణ్, రామ్, చరణ్, సాయి, చరణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో బ్యాటరీ ట్రై సైకిల్స్

సిరిసిల్లఅర్బన్: జిల్లాలోని 75 శాతం ఉన్న దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్స్ పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం శుక్రవారం తెలిపారు. 75 శాతం పైబడి కాళ్లు నడవలేని వారు సదరం సర్టిఫికెట్‌తో తన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. వివరాలకు శ్రీపాద సంతోష్‌కుమార్ 94900 91770లో సంప్రదించాలని కోరారు.

మళ్లీ బూడిద వివాదం

- బయటపడిన కాంట్రాక్టర్ల మధ్య ఆధిపత్య పోరు
- లారీ రేటు విషయంలో కుదరని సయోధ్య
- వినియోగదారులపై రూ.15 కోట్ల భారమంటున్న ఒకవర్గం
- ప్రస్తుత ధర గిట్టుబాటు కాదంటున్న మరోవర్గం
- పోలీసుల వద్దకు పంచాయితీ, ఎన్టీపీసీకి ఫిర్యాదులు
- త్వరలో న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్న కాంట్రాక్టర్లు



సీ బూడిద చెరువు(ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో నిర్మాణ రంగానికి కీలక ముడిసురుకుగా ఉన్న పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎన్టీపీసీ బూడిద(ఫ్లైయాష్) మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇటీవల టెండర్లు దక్కించుకున్న రెండువర్గాల మధ్య లారీ రేటు విషయంలో తలెత్తిన ఆధిపత్యపోరు చివరికి ఫ్లైయాష్ తరలింపు నిలిచిపోయే పరిస్థితికి కారణమవుతోంది. ఇటీవల ఏడాదికాలానికి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లలో రెండువర్గాలు ఉన్నాయి. ఎన్టీపీసీ నియమాల ప్రకారం.. బూడిదను కేవలం వినియోగదారులే తీసుకోవాలి. బహిరంగ మార్కెట్లో విక్రయించకూడదు. తమకు ఎన్టీపీసీ నుంచి టన్ను రూ.40 చొప్పున వస్తున్నపుడు తాము ప్రతీ 25 టన్నుల లారీకి రూ.1100 (జీఎస్టీతో కలిపి), రూ.1,500 లోడింగ్, రూ.400 ఇతర చార్జీలు.. మొత్తం కలిపి లారీకి రూ.3,000 లోడింగ్, రవాణా, టోల్ చార్జీలు కలిపి మరో ప్రతీలారీపై తమకు ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల సరఫరాకు ట్రిప్పుకు రూ.7,000 వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. అదే మరోవర్గం.. ఈ రేటుపై ససేమీరా అంటోంది, తమకు ఈ ధర గిట్టుబాటు కాదని సుమారు రూ.5,000 వరకు లోడింగ్ చార్జీలే అవుతాయని, మొత్తం లారీ మీద ఉమ్మడి జిల్లాలో రూ.10,000పైగా ఖర్చవుతోందని వాదిస్తోంది. అయితే, తమకు 50,000 ట్రిప్పులు (లారీ 25 టన్నులు) అవసరమవుతాయని.. ఆ ప్రకారం రూ.35 కోట్లు ఖర్చు అవుతుందని, అదే ట్రిప్పుకు రూ.10,000 చొప్పున ఖర్చయితే మొత్తం రూ.50 కోట్లు దాటుతోందని అంటున్నారు. అదనంగా రూ.15 కోట్లకుపైగా భారం ఉమ్మడి జిల్లాలోని ఇటుక పరిశ్రమలు, నిర్మాణ రంగాలపై మీద పడుతోందని అంటున్నారు. ఈ బూడిద రాష్ట్రవ్యాప్తంగా సరఫరా అవుతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో ట్రిప్పుకు రూ.10వేలు అయితే, ఇతర జిల్లాలు.. హైదరాబాద్‌కు అంతకుమించి ఖర్చు అవుతోందని స్పష్టం చేస్తున్నారు.

పోలీసుల వద్దా కుదరని సయోధ్య

ఇరువర్గాల మధ్య నెలకొన్న పీఠముడి కాస్తా వెయ్యి ఎకరాల్లో విస్తరించిన బూడిద చెరువు నుంచి బూడిద తరలించకుండా నిలిచిపోయే పరిస్థితులు వచ్చాయి. దీంతో వివాదం పోలీసుల వరకూ వెళ్లింది. పోలీసులు ఎంత నచ్చజెప్పినా.. వీరిమధ్య సయోధ్య కుదరలేదు. అందులో ఒకవర్గం వారు మరోవర్గం వారిని అంతుచూస్తామని హెచ్చరించినట్లు సమాచారం. దీనిపై ఆందోళన చెందిన కొందరు కాంట్రాక్టర్లు.. అసలు అవతలి వర్గం.. నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు దక్కించుకుందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ యాజమాన్యానికి, రామగుండం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనర్హతలతో ఎన్టీపీసీని తప్పుదోవ పట్టించి, తప్పుడు సమాచారంతో టెండర్లు దక్కించుకున్న వారిని తప్పించేలా త్వరలోనే హైకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేస్తున్నారు.

బూడిద నేపథ్యం..

రామగుండం ఎన్టీపీసీలో 2600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి రోజూ 32వేల టన్నుల బొగ్గు మండించగా, సుమారు 13వేల టన్నుల బూడిద (ఫ్లైయాష్), బాటం యాష్ రూపంలో వెలువడుతుంది. కొత్తలో ఈ బూడిదను ఎవరూ తీసుకునే వారు కాదు. పర్యావరణ సమస్యలూ తలెత్తాయి. దీంతో ఇటుకల తయారీలో ఫ్లైయాష్ వినియోగాన్ని కేంద్రం 2000 నుంచి తప్పనిసరి చేసింది. అలా ఇటుకల పరిశ్రమకు బూడిద ఉచితంగా ఇచ్చేవారు. దీనికి రోజురోజుకూ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో 2021 సెప్టెంబరులో ఎన్టీపీసీ టెండర్లు పిలిచింది. వేలానికి ముందు రూ.23గా ఉన్న టన్ను బూడిద.. వేలంలో అనూహ్యంగా రూ.400 చొప్పున కాంట్రాక్టర్లు కోట్‌చేసి ధరల పెరుగుదలకు కారణమయ్యారు. అప్పటివరకు 25 టన్నుల వరకు రూ.700గా ఉన్న లారీ రూ.12,000గా పలికింది. ఈ ప్రభావం ఇటుకల పరిశ్రమ, నిర్మాణ రంగంపై పడి రెండు గదుల ఇంటి నిర్మాణానికి రూ.30వేల భారం పడింది. ఈ విషయాన్ని గతేడాది ‘సాక్షి’ వెలుగులోకి తెచ్చింది. తాజా వేలంలో టన్ను బూడిద రూ.40 మాత్రమే పలికినా, ట్రిప్పు రేటు విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం కొలిక్కి రావడం లేదు.

2021 సెప్టెంబరు ముందు ధరలు
25 టన్నుల బూడిద లారీ రూ.700
టన్ను బూడిద ధర రూ.23.30

2022 సెప్టెంబరు తర్వాత ధరలు
25 టన్నుల లారీ ధర రూ.12,000
టన్ను బూడిద ధర రూ.400

2023 ఆగస్టు తర్వాత ధరలు
25 టన్నుల లారీ ధర రూ.10,000
టన్ను బూడిద ధర రూ.40
(నోట్: ఈ ప్రతిపాదిత ధరల విషయంలోనే వివాదం చెలరేగింది)

రోడ్ల విస్తరణకు మోక్షం

- రూ.35 కోట్లు మంజూరు
- రూ.52 కోట్లతో కోనరావుపేటకు కొత్త వంతెనలు
- కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు



సంఘాల భవనాలకు భూమిపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్ఎస్ అభ్యర్థి లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: ఇన్నాళ్లు ఇరుకైన రోడ్లతో ఇబ్బందులు పడ్డ వేములవాడవాసులు, రాజన్న భక్తుల కష్టాలు తీరనున్నాయి. వేములవాడలో రోడ్ల విస్తరణకు, కోనరావుపేట మండలానికి కొత్త వంతెనల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.35కోట్లతో వేమువాడలో రోడ్ల విస్తరణ, కోనరావుపేట మండలంలో బ్రిడ్జీల నిర్మాణాలకు రూ.52కోట్లను ప్రభుత్వం శుక్రవారం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వేములవాడలోని చెక్కపల్లిరోడ్డులో రెడ్డి, యాదవసంఘాల భవన నిర్మాణాలకు భూమి మంజూరు చేసింది. ఈమేరకు శుక్రవారం ఆయా సంఘాల ముఖ్యులకు ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రొసీడింగ్స్ అందించారు. నిధుల మంజూరుకు సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కులసంఘాలకు భూమిపట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సీఎం అల్పాహారం కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాసరావు, నాయకులు రామతీర్థపు రాజు, జడల శ్రీనివాస్, గంగం మహేశ్, రెడ్డి, యాదవ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేటలో కొత్త వారధులు ఇవే..

మామిడిపల్లి- నిజామాబాద్ హైలెవల్ వంతెనకు రూ.16 కోట్లు, బావుసాయిపేట-వెంకట్రావుపేట హైలెవల్ వంతెనకు రూ.12 కోట్లు, వట్టిమల్ల-నిమ్మపల్లి హైలెవల్ వంతెనకు రూ.14 కోట్లు, కొండాపూర్ వద్ద పెంటవాగుపై హైలెవల్ వంతెనకు రూ.10 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రాజన్నకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

వేములవాడ/వేములవాడఅర్బన్: రాజన్నకు శుక్రవారం ఆరుద్ర నక్షత్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం ఈ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా గర్భగుడి దర్శనాలు నిలిపివేశారు. స్వామి వారి హుండీలలో భక్తులు వేసిన కట్నాలు, కానుకలను శనివారం లెక్కించనున్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో హాజరుకావాలని ఈవో కృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గోశాలలకు రాజన్న కోడెలు

వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని కోడెలను జనగామ జిల్లా కోడకండ్లకు చెందిన యాకన్న గోశాలకు 20, పాలకుర్తి మండలం కొండాపూర్‌లోని లాల్‌తండాకు చెందిన జైబంజార గోశాలకు 20 కోడెలను అందజేశారు. శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ తదితరులు ఉన్నారు.

సెస్ వినియోగదారులకు మెరుగైన సేవలు

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- బోయినపల్లిలో నూతన సెస్ అద్దెభవనం ప్రారంభం



సెస్ ఆఫీస్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, చైర్మన్‌లు

బోయినపల్లి(చొప్పదండి): సెస్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సేవలందించేందుకు ప్రభుత్వం, సెస్ పాలక మండలి కృషి చేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సెస్ కార్యాలయాన్ని శుక్రవారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అందిస్తుందని తెలిపారు. అనంతరం స్థానిక మండల పరిషత్‌లో గృహలక్ష్మి ప్రొసీడింగ్స్, బతుకమ్మ చీరలు, దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక కొండయ్య, జోగినిపల్లి ప్రేమ్‌సాగర్‌రావు, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, సర్పంచ్ గుంటి లతశ్రీ, ఎంపీటీసీ సంబ బుచ్చమ్మ, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుదారుల ఆందోళన



ఎమ్మెల్యే రవిశంకర్‌తో మాట్లాడుతున్న దరఖాస్తుదారులు

బోయినపల్లి(చొప్పదండి): గృహలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా లేదంటూ పలువురు దరఖాస్తుదారులు, స్థానిక యువమిత్ర ప్రతినిధులు బోయినపల్లిలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. మొదట గ్రామపంచాయతీ వద్ద ఎదురుచూడగా అధికారులు రాకపోవడంతో మండల పరిషత్‌కు వెళ్లి ఎంపీడీవో రాజేందర్‌రెడ్డిని నిలదీశారు. అర్హులకు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందించారు. ఈక్రమంలోనే అక్కడికి చేరుకున్న ఎమ్మెల్యే రవిశంకర్‌కు తమ సమస్యను విన్నవించుకున్నారు. బోయినపల్లిలో అర్హులను ఎంపిక చేయలేదని ఫిర్యాదు చేశారు. వెంటనే ఎమ్మెల్యే కలెక్టర్ అనురాగ్‌జయంతితో ఫోన్‌లో మాట్లాడి, బోయినపల్లిలో 419 లబ్ధిదారులకు గాను 170 ప్రొసీడింగ్స్ మాత్రమే పంపారని మిగతా వారికి అందించా లని కోరారు. రేపటి వరకు మొత్తం ప్రొసీడింగ్స్ రా వాలని కలెక్టర్‌కు తెలిపారు. బోయినపల్లిలో గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ పంపిణీని తాత్కాలికంగా నిలిపివేశారు.

విధులకు ఆటంకం కల్పించిన ఐదుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్‌లో గత నెల 30న వినాయక నిమజ్జనం సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కల్పించిన ఐదుగురినిశ శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. వెంకటాపూర్‌కు చెందిన కుక్కల వెంకటేశ్, పడిగె ఆదర్శ్, కంకనాల సురేశ్, పొన్నం సాయి, కంకనాల సాయితోపాటు మరికొందరు కలిసి పోలీసుల విధులకు ఆటంకం కల్పించారు. దీంతో వారిపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఐదుగురిని పట్టుకొని అరెస్ట్ చేసి సిరిసిల్ల న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు.

వంద రోజుల్లోనే అమలు చేస్తాం



ఆరు గ్యారంటీ పథకాల గురించి వివరిస్తున్న ఆది శ్రీనివాస్

• డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఆరు పథకాలు అమలు చేస్తామని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలం ఫాజుల్‌నగర్, తుర్కాషినగర్ గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం చేశారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీపై నమ్మకముంచి ఒక్కసారి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రూ.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు అందజేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలు అభివృద్ధి



సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. చంద్రంపేటలో శుక్రవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు ఆధ్వర్యంలో జెండా పండుగ నిర్వహించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గానికి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాగుల సత్యనారాయణగౌడ్, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజ్, బాలరాజ్, వెంకటేశం, శ్రీనివాస్, నాగభూషణం, సత్యనారాయణ, కిరణ్, రియాజ్ ఉన్నారు.

చేయి చేయి కలిపారు.. రోడ్డు బాగుచేశారు

• రోడ్డు మరమ్మతు చేసిన ఆటోడ్రైవర్లు



వేములవాడ: చేయి చేయి కలిపారు... రోడ్డును చదును చేసుకున్నారు. వేములవాడ పట్టణ శివారులోని ఎస్సారార్ ఫంక్షన్ హాల్ సమీపంలోని కట్టుకాలువ ఇటీవల వరదలకు దెబ్బతింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండడంతో ఆటోడ్రైవర్లు స్పందించారు. శ్రమదానంతో రోడ్డును బాగుచేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతతో కూడిన వంతెన పనులు చేపట్టాలని ఆటోకార్మికులు సుధాకర్, రమేశ్ కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో బావుసాయిపేటకు ఆటోడ్రైవర్లు సుధాకర్, అనిల్, శ్రీకాంత్, రమేశ్‌రెడ్డి, ఎన్గల్‌కు చెందిన రమేశ్, మామిడిపల్లికి చెందిన భాస్కర్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ఆటోకార్మికులను ఆదుకునేందుకు బీమా



ముస్తాబాద్(సిరిసిల్ల): ఆటో కార్మిక కుటుంబాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలంగాణ సేవటాక్సీ ఆల్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి సంపత్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు కె.కె.మహేందర్‌రెడ్డి స్వయంగా బీమా మొత్తం చెల్లించగా శుక్రవారం బీమా కార్డులను పంపిణీ చేశారు. టీఎస్‌టీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు సంపత్‌రెడ్డి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల కుటుంబాలకు అండగా నిలిచేందుకు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికి డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుధాకర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, మెట్టు రమేశ్, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి, నక్క ప్రశాంత్, వేణుగోపాల్, రవి పాల్గొన్నారు.

లండన్ హతుడు బొప్పాపూర్ వాసి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): లండన్‌లో గత శనివారం దుండగుల చేతిలో హత్యకు గురైన రాయీసుద్దీన్ ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌వాసి. ఈ విషయం స్థానికులకు ఆలస్యంగా తెలిసింది. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన చాంద్‌పాషా కుమారుడు రాయీసుద్దీన్ గత శనివారం లండన్‌లో దుండగుల చేతిలో కత్తిపోట్లకు గురయ్యాడు. గత పదమూడేళ్లుగా లండన్‌లో ఉద్యోగరీత్యా స్థిరపడ్డాడు. ఇతరులు గొడవపడుతుండగా అడ్డుగా వెళ్లిన రాయీసుద్దీన్ దారుణ హత్యకు గురైనట్లు తెలిసింది. అయితే వీరి కుటుంబం గత పదేళ్లుగా హైదరాబాద్‌లోని మాసాబ్‌ట్యాంక్‌లో నివసిస్తున్నారు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో ఐదుగురికి ఒక రోజు జైలు, రూ.వేయి జరిమానా విధిస్తూ జడ్జి ప్రవీణ్ శుక్రవారం తీర్పునిచ్చినట్లు కోర్టు వర్గాలు వెల్లడించాయి. డ్రంకెన్‌డ్రైవ్ చేయొద్దని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై విచారణ

- ఆక్రమిస్తే చట్టరీత్య చర్యలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు



విచారణ చేపడుతున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని సింగారంలో కొందరు ప్రభుత్వ భూములను కబ్జా చేయాలన్న ప్రయత్నాలు బెడిసికొట్టాయి. పురోహితులకు కేటాయించిన భూమిలో గ్రామానికి చెందిన ఒకరిద్దరు అక్రమంగా ప్రవేశించి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా.. తహసీల్దార్ అధికారులు అడ్డుకట్ట వేశారు. సింగారం గ్రామ శివారులోని సర్వేనంబర్ 137లో నాలుగెకరాలు, 220లో 2.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ముప్పైఏళ్ల క్రితం ప్రభుత్వం 137 సర్వేనంబర్‌లోని నాలుగెకరాల భూమిని అప్పటి గ్రామ పురోహితులకు కేటాయించింది. పురోహితులు ఉద్యోగాల రీత్య హైదరాబాద్‌లో స్థిరపడగా, వారు ముప్పైఏళ్లుగా ఆ భూమిని సేద్యం చేసుకోలేకపోయారు. ఇదే అదునుగా భావించిన గ్రామానికి చెందిన కొందరు ఈ భూములపై స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేశారు. దీంతో గ్రామస్తులు పురోహితులకు సమాచారం అందించగా, వారు గ్రామానికొచ్చి ఆ భూములను గతంలోనే తమకు కేటాయించారని అధికారులకు తెలపడంతోపాటు కొలతల కోసం ఎంసీకి దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ రామచందర్ ఆదేశాలతో ఆర్ఐ సంతోష్, సర్వేయర్ చామంతి శుక్రవారం భూములను పరిశీలించారు. గ్రామంలో బహిరంగ విచారణ చేపట్టారు. ఆ భూములను గతంలో పురోహితులకు ఇచ్చినప్పటికీ, వారు సేద్యం చేసుకోకపోవడంతో తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని గ్రామస్తులకు వివరించారు. ఈ భూముల్లోకి ఎవరైన అక్రమంగా ప్రవేశించి, స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు రోజుల్లో హద్దులు నిర్ణయించి, హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.